గుబ్బ గుర్తిలో మావోయిస్టుల బ్యానర్

సమీప గ్రామాల్లో అలజడి.. తొలగించిన పోలీసులు..



పంటపాలాల్లో బ్యానర్‌ను ఏర్పాటు చేసిన మావోయిస్టులు

కొణిజర్ల, ఆగస్టు 4: మావోయిస్టుల వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటైన బ్యానర్‌ను పోలీసులు ఆదివారం గుర్తించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బ గుర్తి అటవీ ప్రాంతంలోని పెద్దరాంపురం సమీపంలో ఉన్న ఈ బ్యానర్ వారు తొలగించారు. '2024 జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని జరపండి. ప్రజలపైనా, మావోయిస్టు పార్టీపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించండి. పేదల సంక్షేమాన్ని మరిచిన ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించండి.' అనే నినాదాలతో 'సీపీఐ మావోయిస్టు పార్టీ, భద్రాద్రి కొత్తగూడెం , ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ' పేరిట ఆ బ్యానర్ ఉంది. అయితే ఆదివారం నాడు ఈ బ్యానర్‌ను గుర్తించిన స్థానికులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శంకర్‌రావు అక్కడకు చేరుకొని దానిని తొలగింపజేశారు. కాగా, ఇప్పటి వరకు ఎటువంటి మావోయిస్టుల ప్రాబల్యం లేని గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలో బ్యానర్ వారి పేరిట ఉన్న కన్పించడంతో చుట్టుపక్కల గ్రామాల్లో అలజడి నెలకొంది. ఈ విషయమై ఎస్సై శంకర్‌రావును వివరణ కోరగా.. అది ఆకతాయిల పని అయి ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు.

అతిథి అధ్యాపక పోస్టులకు భారీగా దరఖాస్తులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 4: కూసుమంచిలోని ఈ సంవత్సరం కొత్తగా ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. సోమవారం నుంచి ఇంటర్ విద్యాశాఖ సిబ్బంది స్ట్రాట్స్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి డీఐఈవో రవిబాబు స్పష్టమైన సూచనలు చేశారు. 12 మంది అతిథి అధ్యాపకులు, ఆరుగురు సిబ్బందిని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియామకాలు భరీ చేయనున్నారు. టీచింగ్‌లో ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ పోస్టులకు 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. నాన్ టీచింగ్‌లో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్ ఉద్యోగాలకు 440 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నాతాధికారుల మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 12వరకు మెరిట్ లిస్ట్ విడుదల చేయనున్నట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు.

నేటి నుంచి శిక్షణలో డీఐఈవో

హైదరాబాద్‌లోని ఎంహెచ్ఆర్‌డీలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో జిల్లా ఇంటర్ విద్యాధికారి కె రవిబాబు పాల్గొనున్నారు. రాష్ట్రంలోని పలువురు జూనియర్ లెక్చరర్స్‌తో పాటు పలువురు డీఐఈవోలకు శిక్షణలో మేనేజ్‌మెంట్ అంశాలపై కార్యక్రమం నిర్వహించనున్నారు.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 4: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 4: నేటి నుంచి (సోమవారం) ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను తమ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రజవాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

భూవివాదాల నేపథ్యం..

రైతు ఆత్మహత్యాయత్నం

- తన భూమిని దున్నవద్దంటూ ఆక్రమణదారుల అడ్డగింత
- వినిపించుకోకపోవడంతో పురుగుమందు తాగిన వెంకటరెడ్డి
- పోలీసులు న్యాయం చేయడం లేదంటూ సెల్ఫీ వీడియో

ఏలేటి వెంకటరెడ్డి (ఫైల్)

ఖమ్మం రూరల్, ఆగస్టు 4:భూ వివాదాల నేపథ్యంలో పురుగుమందు తాగి ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు, అతడి కుటుంబీకుల కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలంలోని జాన్‌బాద్‌తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డి తనకున్న మూడు ఎకరాల భూమిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే, అతడి సోదరుడు భూపాల్‌రెడ్డి.. అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న దగ్గర కొంత అప్పు తీసుకున్నాడు. దానికి తిరిగి చెల్లించని కారణంగా కొంతకాలానికి భూపాల్‌రెడ్డి భూమిని జాటోత్ వీరన్న స్వాధీనం చేసుకున్నాడు. అయితే భూపాల్‌రెడ్డి భూమి పక్కనే వెంకటరెడ్డి భూమిని వీరన్న ఆక్రమించాడు. ఈ విషయంపై గతంలో అనేకమార్లు గొడవలు జరిగాయి. ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల కూడా వెంకటరెడ్డి భూమిని వీరన్న దున్నడం, వెంకటరెడ్డి వెళ్లడం ఆపేందుకు ప్రయత్నించడం, అయినా అతడు వినిపించుకోకపోవడం, మళ్లీ కేసులు, కోర్టులకు వెళ్లడం వంటివి జరిగాయి. ఈ క్రమంగా తాజాగా ఆదివారం కూడా మరోసారి వెంకటరెడ్డి పొలాన్ని ట్రాక్టర్‌తో వీరన్న దున్నుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటరెడ్డి అక్కడికి వెళ్లాడు. తన భూమిని దున్న వద్దంటూ అడ్డుకున్నాడు. అయినప్పటికీ వీరన్న వినిపించుకోకుండా అలాగే దున్నుతున్నాడు. దీంతో విసుగు చెందిన వెంకటరెడ్డి.. 'నా భూ తగాద విషయంలో ఖమ్మం రూరల్ పోలీసుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. ఎనిమిదేళ్లుగా ఇబ్బంది పడుతున్నాను. ఏ ఒక్క అధికారీ నాకు న్యాయం చేయడం లేదు.' అంటూ ఆరోపిస్తూ పొలం వద్ద సెల్ఫీ వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు. ఆ తరువాత పురుగుమందు తాగాడు. విషయాన్ని గమనించిన సమీప ప్రాంత ప్రజలు.. వెంకటరెడ్డి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కేసు నమోదు

భూ వివాదంలో చోటుచేసుకున్న పరిణామాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఖమ్మం రూరల్ ఎస్సై రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని జాన్‌బాద్‌తండాకు మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి ప్రోద్బలంతో అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న, జాటోత్ చిన్నీ, సురేశ్, జాటోత్ దేవిక, జాటోత్ ఉపేందర్‌లు అదే గ్రామానికి చెందిన ఏలేటి వెంకటరెడ్డి పొలంలోకి ఆదివారం ప్రవేశించారు. వెంకటరెడ్డిని అతడి పొలం సాగుపనులు చేసుకోనీయకుండా అడ్డుపడ్డారు. అతడిపై దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటరెడ్డి పురుగుమందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ప్రస్తుతం అపస్మారకస్థితిలో ఉండి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పై వ్యక్తులు దుర్భాషలాడడం వల్లనే తన భర్త పురుగుమందు తాగాడంటూ వెంకటరెడ్డి భార్య ఏలేటి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలి

ఆందోళన చేస్తున్న స్థానికులు

ముదిగొండ, ఆగస్టు 4: ముదిగొండ, ఆగస్టు 4: రోడ్డు మరమ్మతు పనులు నిలిచిపోవడంతో దుమ్మూ, ధూళితో ఇబ్బంది పడుతున్నామనీ ముదిగొండలో స్థానికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ముదిగొండ– న్యూలక్ష్మీపురం ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులు ఆరు నెలల క్రితమే ప్రారంభించి కంకర, డస్ట్ పోసి రోలర్‌తో తొక్కించి రెండు నెలలు అవుతున్నా తారు పోయకుండా వదిలేశారని అన్నారు. అప్పటి నుంచి ఎలాంటి పనులు చేయకపోవటంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు దుమ్ము లేచి ఇబ్బంది పతున్నామని తెలిపారు. తమ ఇళ్లలోకి దుమ్ము రావడంతో చిన్న పిల్లలకు శ్వాస సంబంధిత వ్యాధులు వస్తున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డు త్వరగా పూర్తి చేయాలనీ లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు వచ్చి సర్దిచెప్పటంతో ఆందోళన విరమించారు.

మున్నూరు కాపులు సంఘటితం కావాలి

ఆర్‌జేసీ కృష్ణను సన్మానిస్తున్న సంఘ నాయకులు

ఖమ్మం, ఆగస్టు 4: మున్నూరు కాపులు సంఘటితంగా ముందుకు సాగాలని ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎస్‌బీఐటీ, ఆర్జేసీ విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ పిలుపునిచ్చారు. 33 జిల్లాల మున్నూరు కాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఈసీ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు బీసీ కులాలను కలుపుకొని అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కాపులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని అన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్జేసీ కృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బాల శ్రీనివాసరావు పటేల్, ఇట్యాల వెంకట కిషన్ పటేల్, జిల్లా అధ్యక్షులు పెదబోయిన నాగరాజు, ట్రెజరర్ అచ్యుతరావు, నాయకులు కర్నాటి సోమయ్య సుధాకర్, రంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి నెలనెలా వెన్నెల వార్షికోత్సకోత్సవాలు

ఖమ్మం, ఆగస్టు 4: ఖమ్మం నగరంలో ఆగస్టు 9,10, 11 తేదీల్లో నెల నెలా వెన్నెల వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ సంచాలకులు మామిడి హరికృష్ణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, వేముల సదానంద్, నామ లక్ష్మీనారాయణ ఆదివారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మాట్లాడారు. 9,10, 11న జరిగే ఆహ్వాన నాటిక పోటీలు ఖమ్మం ప్రేక్షకులను అలరింప జేస్తాయని, ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, రోజు మూడు నాటికలు చొప్పున మూడు రోజులు తొమ్మిది నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు. అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, వేముల సదానంద్, నామ లక్ష్మీనారాయణ, మారుతి కొండలరావు, చెరుకుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' వింతలు ఇంతింత కాదయా..

200లోపు రీడింగ్‌కు జీరో బిల్ రాని వైనం

189 యూనిట్లకు నగదు చెల్లించాలని వచ్చిన బిల్లు



ERO: ERO/TOWN2/KHAMMAM(1929)
Sec: BALLEPALLY
SC No. 30144-05309
USC No. 14343653
Name: BOINA VENKATAMMA
Addr: D. No.
PRP
Cat:1-B(2) Domestic Ph:1
Contracted Load: 2.0 KW
Meter No: 03819838(IRDA) MF: 1
STR Code: 220050519001
Pole No: PRP
Date Sts Reading
Present KWH 04/08/24 01 9302
Previous KWH 06/07/24 01 9113
KWH Units: 189 Days: 29
BILLED UNITS: 189
Average Month Units: 202.03
Recorded MD 2.19 KW
Energy Charges 966.50
Fixed Charges 21.90
Customer Charges 100.00
Electricity Duty 11.34
Interest on ED 0.00
Surcharge 0.00
ACD Surcharge 0.0
FSA/FCA Charges 0.0

189 యూనిట్లకే కట్టాలని వచ్చిన బిల్లు

రఘునాథపాలెం, ఆగస్టు 4: కాంగ్రెస్ సర్కార్ గృహజ్యోతి పేరుతో ప్రజలను మోసం చేస్తోంది. పథకాలకు అర్హులైనప్పటికీ కొర్రీల పేరుతో నిరుపేదల జేబులకు చిల్లు పెడుతోంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే 'గృహజ్యోతి' పథకం. ఖమ్మం నగరం పాండురంగాపురానికి చెందిన బీ వెంకటమ్మ తనకు ఉన్న మీటర్‌కు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నది. ఆగస్టు నెలకు సంబంధించి ఆదివారం రీడింగ్ తీసేందుకు ఇంటికి వచ్చిన సిబ్బంది రీడింగ్ తీసి రూ.1100 బిల్లు చెల్లించాలని వెళ్లిపోయాడు. అవాక్కైన వెంకటమ్మ బిల్లును పరిశీలించగా 29 రోజులకు 189 యూనిట్లు మాత్రమే వినియోగించినట్లుగా గమనించింది. 200లోపు యూనిట్లు ఫ్రీ అని చెప్పి ఇప్పుడు బిల్లు కట్టాలి అంటున్నారు అని చెప్పి లబ్దిదారులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి విషయాన్ని అడిగింది. దీంతో సదరు అధికారి మీకు 29 రోజులకే బిల్లు తీశాము.. కానీ సిస్టమ్ 30 రోజులకు రీడింగ్ తీసుకున్నది అంటూ సమాధానం ఇచ్చాడు. ఎప్పుడు తీసినా 200లోపు యూనిట్లు మాత్రమే వస్తుంది కదా.. అని అడిగితే ఇష్టం ఉన్నచోట చెప్పుకో.. అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఎదురైంది. గృహజ్యోతి పథకం అంతా మోసం అంటూ మిన్నకుండి పోయింది.

ఇల్లు కూలి వ్యక్తి మృతి

బూర్గంపహాడ్, ఆగస్టు 4: భద్రాచలం పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున ఇల్లు కూలిపోవడంతో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భద్రాచలంలోని తాతగడి సెంటర్‌కు చెందిన వెంకన్న ఓ హోటల్‌లో రోజువారీ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి వెంకన్న తన ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు తాను నివసిస్తున్న ఇంటి గోడలు నాని ఉండడంతో తెల్లవారుజామున ఒక్కసారిగా కూలిపోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న వెంకన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులమంటూ యువకులపై దాడి

రామవరం, ఆగస్టు 4 : చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ సమీపంలో రీల్స్ చేసుకుంటున్న యువకులపై పోలీసులమంటూ దాడికి పాల్పడిన ఘటన ఆదివారం టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. పెనగడప సమీపంలో రీల్స్ చేసుకుంటున్న యువకుల వద్దకు కారులో వచ్చి ఆరుగురు తాము టూటౌన్ పోలీసులమంటూ తమపై దాడి చేశారని ఆ యువకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రుణానికి బీమా రక్ష

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలెన్నో..

గృహ రుణం అంటే దీర్ఘకాల అప్పు. దీన్ని చెల్లించేటప్పుడు అనేక ఒడిదొడుకులు సహజం. అందుకే ఈ రుణానికి బీమా రక్షణ ఇవ్వడం తెలివైన పని అనిపించుకుంటుంది. అప్పుడే మనకు, మన కుటుంబ సభ్యులకు ప్రశాంతత అనేది ఉంటుంది. నిజానికి రుణం తీసుకుంటే దానికి బీమాను కూడా తీసుకోవాలని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)గానీ, ఇటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐగానీ చెప్పడం లేదు. అయితే మన లాభం కోసం, మన కుటుంబ సభ్యులకు రుణ భారం లేకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం ఉత్తమం.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ అంటే?

హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్ (హెచ్ఎల్‌పీపీ) అని కూడా పిలుస్తారు. ఈ స్కీమ్‌లను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ బ్యాంకింగ్, నాన్–బ్యాంకింగ్ సంస్థలన్నీ అందిస్తున్నాయి. మరణం, ఆరోగ్యం పాడైపోయి, ఏదైనా కారణం చేత అవయవాలు కోల్పోయి పనిచేయలేని స్థితికి రుణగ్రహీత చేరితే రుణ చెల్లింపుల సంగతిని బీమా సంస్థే చూసుకుంటుంది.

గృహ రుణ బీమా ప్రాముఖ్యత

రుణమిచ్చే బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు.. తమ రుణాలు మొండి బకాయిలుగా మిగిలిపోవాలని చూడవు. అందుకే రుణం తీసుకునేటప్పుడే దానికి బీమా కూడా తీసుకోవాలని రుణగ్రహీతకు ఆయా సంస్థలు చెప్తాయి. దాని ప్రాధాన్యతనూ వివరిస్తాయి. పైగా ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మునుపెన్నడూ లేనివిధంగా విజృంభించిన కరోనా మహమ్మారి.. మానవుల జీవితాలను ఎంతో ప్రభావితం చేసింది. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఎన్నో విధాలుగా వెనక్కినెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రుణ బీమా మన కుటుంబాలకు రక్షగా ఉంటుంది. దురదృష్టవశాత్తు చనిపోయినా, పూర్తిగా అంగవైకల్యం బారినపడ్డా బీమా సంస్థే మన రుణ చెల్లింపుల్ని చేస్తుంది. దీనివల్ల మనం లేనిరోజున మనవాళ్లకు కనీసం సొంత ఇల్లైనా దక్కుతుంది. అలాగే ఉద్యోగం కోల్పోయినా ఆసరాగా ఉంటుంది. అయితే స్టాండర్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా అన్ని ఫీచర్లున్న బీమాను కొనాలన్నది మర్చిపోవద్దు.

గుర్తుంచుకోండి..

ప్రీమియంలు

గృహ రుణ బీమా కవరేజీ ప్రీమియంను ఒకేసారి మొత్తంగా చెల్లించవచ్చు. లేదా హోమ్ లోన్ ఈఎంఐలతోపాటు నెలనెలా కొంత మొత్తాల్లోనూ చెల్లించవచ్చు.

జాయింట్ హౌజ్ లోన్

సంయుక్త గృహ రుణగ్రహీతలకూ ఈ బీమా ఉపయుక్తంగా ఉంటుంది. కో–అప్లికెంట్స్ అందరికీ ఇది వర్తిస్తుంది. అందువల్ల ఒకవేళ కుటుంబంలోని ముగ్గురు కలిసి రుణాన్ని తీసుకున్నా.. వారిలో దురదృష్టవశాత్తు ఒక్కరు అకాల మరణం పాలైనా బీమా కవరేజీని పొందవచ్చు.

రైడర్స్–యాడ్ ఆన్స్

బేసిక్ గృహ రుణ బీమాలో రుణగ్రహీత చనిపోతే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ రైడర్ స్కీమ్‌ను యాడ్ చేసుకోవాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సిందే. రుణగ్రహీతకు గుండెపోటు, క్యాన్సర్, ఇతర ప్రమాదకర గాయాలపాలైనా బీమా వర్తించగలదు. అంగవైకల్యానికి గురైనా లేదా ఉద్యోగం కోల్పోయినా, ఉపాధి కరువైనా 6 నెలలదాకా ఈఎంఐ చెల్లింపులకు యాడ్ ఆన్స్ కవరేజీని ఇవ్వగలవు.

బీమాలో రకాలు..

హైబ్రిడ్ ప్లాన్లు

హైబ్రిడ్ కవర్ ప్లాన్లలో బీమా కవరేజీ మొత్తం తొలి ఏడాది స్థిరంగా ఉంటుంది. అయితే రెండో ఏడాది నుంచి క్రమేణా కవరేజీ తగ్గిపోతూ ఉంటుంది. గృహ రుణ బకాయి మొత్తాలు కూడా తగ్గుతుండటమే దీనికి కారణం.

లెవల్ కవర్ ప్లాన్లు

గృహ రుణం కాల వ్యవధి ఎప్పటిదాకా ఉంటుందో అప్పటిదాకా ఈ లెవల్ కవర్ ప్లాన్లలో బీమా ప్రయోజనాలు స్థిరంగా ఉంటాయి. రుణ మొత్తాలు తగ్గుతున్నంత మాత్రాన బీమా కవరేజీ తగ్గిపోదు. కాబట్టి ముందే ఆలోచించి ప్లాన్లపై ఓ నిర్ణయం తీసుకోవాలి.

ప్రయోజనాలివే..

పన్ను ప్రోత్సాహకాలు

గృహ రుణగ్రహీతలు.. హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను కూడా తీసుకోవడం వల్ల పన్ను ప్రోత్సాహకాలను అందుకోవచ్చు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద బీమా కోసం చెల్లించే ప్రీమియంలను పన్ను మినహాయింపునకు కోరవచ్చు.

కుటుంబ రక్షణ

కుటుంబ పెద్ద అకాల మరణం పాలైనప్పుడు.. గృహ రుణ భారం ఆ కుటుంబ సభ్యులపై పడకుండా హోమ్ లోన్ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. కాబట్టి రుణం తీసుకున్నప్పుడు దానికి బీమా కూడా తీసుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

చివరగా.. ఇన్సూరెన్స్ ప్రీమియంలను రుణ మొత్తం, రీపేమెంట్ టెన్యూర్, రుణగ్రహీత వయస్సు, ఆరోగ్య పరిస్థితులు ప్రభావితం చేయగలవు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లో బీమా వర్తిస్తుంది. అత్యుత్తమ బీమా కవరేజీనే తీసుకుంటున్నామా? అన్నదీ పరిశీలించుకోవాలి. క్లెయిమ్ సెటిల్మెంట్లు, పేమెంట్ పద్ధతిని కూడా కనుక్కోవడం మంచిది.

ఇల్లు కొంటున్నారా?

పీఎంఏవై పథకంలో వడ్డీ రాయితీ పొందండిలా



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం మళ్లీ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024 –25)గాను గత నెల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో దీన్ని తిరిగి తీసుకొచ్చారు.

ఏమిటీ పీఎంఏవై?

ఈ పథకం 2015లో మొదలైంది. దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు పక్కా గృహాలు, కనీస వసతుల్ని కల్పించడమే ఈ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం లక్ష్యం. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ఇందులో పీఎంఏవై–గ్రామీణ్, పీఎంఏవై–అర్బన్ పేరిట రెండు విభాగాలున్నాయి. ఇంటి నిర్మాణం, కొనుగోలు కోసం తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీలో రాయితీ ప్రయోజనాన్ని పీఎంఏవై అందిస్తుంది.

ఎవరు అర్హులు?

- వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉన్న ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు.
- రూ.3–6 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న అల్పాదాయ వర్గాలు.
- రూ.6–12 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న మధ్యతరగతి ప్రజానీకం.
- రూ.12–18 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న ఎగువ మధ్యతరగతి కుటుంబాలు.
- పీఎంఏవై దరఖాస్తుదారులు భారతీయులై ఉండాలి. దేశంలో మరెక్కడా వారికి సొంతిల్లు ఉండరాదు.
- కేంద్ర ప్రభుత్వం ద్వారా మరే ఇతర గృహ సంబంధిత పథకాల ప్రయోజనాలను గతంలో పొంది ఉండకూడదు.

ఇదీ సంగతి..

- నిర్ణీత వైశాల్యాల్లోని నివాసాలకే పథకం.
- మహిళలకు తక్కువ వడ్డీరేటుకే రుణాలు.
- రుణం ఎంత మొత్తమైనా తీసుకోవచ్చు. కానీ ఈ పథకం ప్రయోజనం సదరు రుణ మొత్తంలో రూ.12 లక్షల వరకే వర్తిస్తుంది.
- గరిష్ఠంగా రూ.2.67 లక్షలదాకా సబ్సిడీ.
- ఇల్లు పూర్తిగా మహిళ పేరిటగానీ, లేదా సహ యజమానిగానైనా స్త్రీలుండాలి.
- స్టాంప్ డ్యూటీ తగ్గింపు, పన్ను మినహాయింపులు, రిజిస్ట్రేషన్ చార్జీల్లో కోతలు.
- మహిళలకు రుణంపై రూ.1.5 లక్షల దాకా, వడ్డీపై రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపు. దంపతులిరువురికీ ఆదాయం ఉన్నట్టైతే ఈ ప్రయోజనం రూ.3 లక్షలు, రూ.4 లక్షలదాకా ఉండటం విశేషం.

దరఖాస్తు ఇలా..

ఆన్‌లైన్‌లోనైతే అర్హులు తొలుత పీఎంఏవై అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. ఆపై 'సిటిజన్ అసెస్‌మెంట్', 'బెనిఫిట్స్ అండర్ అదర్ 3 కాంపోనెంట్స్'లపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత ఆధార్ వివరాలిస్తే దరఖాస్తు ఫారం వస్తుంది. అందులో అన్ని వివరాలను నింపితే సెక్యూరిటీ క్యాప్చా వస్తుంది. దాన్ని పూర్తిచేసి 'సేవ్' చేస్తే అప్లికేషన్ నెంబర్ వస్తుంది. దీన్ని భవిష్యత్తు అవసరాలకు రెఫరెన్స్‌గా తీసుకోవాలి. ఆఫ్‌లైన్‌లోనైతే.. ఎస్బీఐ, ఇతర పీఎంఏవై పథకం వర్తించే బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించాలి. ఆదాయ ధ్రువీకరణ, కావాల్సిన డాక్యుమెంట్లు చూపించి ఆమోదం పొందవచ్చు. ఆపై సబ్సిడీ వడ్డీరేటుపై ఇంటి కొనుగోలు ప్రక్రియలోకి దిగవచ్చు.

రాబడి

క్రెడిట్ కార్డ్ కావాలా.. నాయనా!

బ్యాంకుల్లో, పెట్రోల్ బంకుల్లో, షాపింగ్ మాల్స్‌లో క్రెడిట్ కార్డ్ కావాలా? అంటూ అడిగితే.. ఊ కొడుతూ వెళ్లే ముందు ఇదికాస్త ఆలోచించుకోండి. మీరు తీసుకునే క్రెడిట్ కార్డ్‌కు సంబంధించిన నియమ, నిబంధనలను పూర్తిగా చదవడం మర్చిపోవద్దు. దానిపై పొందే నగదు మ